సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 11 । జూన్ । 2023



వర్గల్ క్షేత్రం.. ఉత్సవ శోభితం
శ్రీ కంచి శంకరమఠం, శ్రీశారదా వైదిక స్మార్త విద్యాలయ ప్రారంభోత్సవానికి వర్గల్ శ్రీవిద్యా సరస్వతి క్షేత్రం ముస్తాబైంది. కంచి కామకోటి సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి హాజరుకానున్నారు. 8లో



లక్ష్యంలేని చదువు వ్యర్థం 9లో
ప్రతి విద్యార్థి జీవిత లక్ష్యంతో చదవాలని, లక్ష్యం లేని చదువు వ్యర్థమని ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ అన్నారు. పది, ఇంటర్, డిగ్రీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సన్మానించారు.

అందరికీ నెగెటివ్
పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 11 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు చేశారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు పది మందికి చేసినట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

సబ్సిడీ విత్తనాల పంపిణీ

డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్



జహీరాబాద్ టౌన్: ఖరీఫ్ సీజన్‌కు గాను డీసీఎంఎస్ ద్వారా సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ మల్కాపురం శివకుమార్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సోయాబిన్, జనుము, జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. నేషనల్ సీడ్స్ కంపెనీ సర్టిఫైడ్ చేసిన జెఎస్–335 రకం సోయా విత్తనాలు మాత్రమే రైతులకు ఇస్తున్నామని చెప్పారు. 30 కిలోల బస్తా రూ.3,600 ధర ఉండగా సబ్సిడీపై రూ.2500, 40 కిలోల జనుము విత్తనాల బస్తా రూ. 3500 ఉండగా సబ్సిడీపై రూ.1224.80, 30 కిలోల జీలుగ బస్తా సబ్సిడీపై రూ.2,408 వేలకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని రైతులు ప్రభుత్వం సర్టిఫైడ్ చేసిన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు.

కేతకిలో నూతన ఎస్పీ పూజలు



కేతకిలో పూజలు చేసిన ఎస్పీ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీకేతకి సంగమేశ్వర ఆలయాన్ని పదోన్నతి పొందిన ఇంటిలిజెన్స్ ఎస్పీ శిరీష కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. శనివారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గర్భగుడిలో కొలువైన పార్వతీ పరమేశ్వరులకు అభిషేకం, మహామంగళహారతి తదితర పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కవి సమ్మేళనం

సంగారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా, జూన్ 11వ తేదీన తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ శరత్ శనివారం తెలిపారు. ఆదివారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రభుత్వం సాధించిన ప్రగతిపై కవితలు తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో ఉండాలన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనటకు గతంలో నమోదు చేసుకున్న కవులే కాకుండా, ఆసక్తి కలిగిన వారు నేరుగా నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని కోరారు.

గ్రూప్–1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జూన్ 11వ తేదీన జిల్లాలో నిర్వహించనున్న గ్రూప్–1 పరీక్ష ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శరత్ తెలిపారు. శనివారం సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా గ్రూప్–1 పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్ష సజావుగా జరిగేలా ఆయా శాఖల అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. అభ్యర్థులు ఎవరికైనా హాల్ టికెట్ పై ఫొటో రాకపోతే హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ సంతకం చేసిన మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఇతర ఐడీ ప్రూఫ్ తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు పటిష్టంగా ఉండాలని పోలీస్ అధికారులకు సూచించారు. 144 సెక్షన్ అమల్లో ఉండాలని, కేంద్రాల పరిసరాలలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్స్ మూసివేయించాలన్నారు. ఉర్దూ, తెలుగు మీడియం అభ్యర్థులకు వేర్వేరుగా హాల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్ష కేంద్రంలోకి చీఫ్ సూపరెంటెండెంట్లు, లైజన్ ఆఫీసర్లకు మినహా ఎవ్వరికి సెల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. టెలీకాన్ఫరెన్స్ లో ఎస్పీ రమణకుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, చీఫ్ సూపరెంటెండెంట్లు, డీఆర్వో నగేష్, సంగారెడ్డి పటాన్‌చెరు డీఎస్పీలు, ఆర్డీఓ రవీందర్ రెడ్డి, రూట్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, ఎంపీడీఓలు, తహసీల్దారులు, తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్య

- వివరాల నమోదు తర్వాత దరఖాస్తు స్వీకరించని వైనం
- మీసేవా కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్న దరఖాస్తుదారులు
- రూ.లక్ష ఆర్థిక సహాయం పథకం దరఖాస్తుదారుల తిప్పలు
- గంటల తరబడి ఎదురు చూసి నిరాశతో ఇంటిముఖం



సంగారెడ్డిలోని మీ సేవా కేంద్రం వద్ద వేచిఉన్న దరఖాస్తుదారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: బీసీ కులవృత్తులు, చేతి వృత్తులు చేసుకునేవారికి రూ.లక్ష ఆర్థిక సహాయం పథకానికి దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు సాంకేతిక సమస్య ఎదురవుతోంది. అర్హులైన లబ్ధిదారులు మీసేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే వెబ్‌సైట్ వివరాలను తీసుకోవడం లేదు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు వివరాలన్నీ పూర్తి చేశాక సబ్‌మిట్ క్లిక్ చేస్తే దరఖాస్తులను స్వీకరించడం లేదు. దరఖాస్తులో నమోదు చేసిన వివరాలన్నీ పోతుండటంతో లబ్ధిదారులు మీసేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గంటల తరబడి ఎదురుచూసి ఓపెన్ కాకపోవడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.

నియోజకవర్గం వివరాలు సైతం..

- బీసీల్లోని 15 కుల, చేతివృత్తులు చేసుకునే వారికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించిన విషయం విదితమే. ఈ పథకానికి ఈనెల 6 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అధికార యంత్రాంగం ప్రకటించింది.
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో https:// tsobmmsbc.cgg.gov.inలో దరఖాస్తులను తీసుకుంటున్నారు. సాధారణంగా ఇతర పథకాల కోసం చేసుకునే దరఖాస్తుల్లో నియోజకవర్గం వివరాలు ఉండవు.
- కానీ గ్రామం, మండలం, జిల్లా వివరాలు ఉంటాయి. కానీ ఈ దరఖాస్తు కోసం ప్రత్యేకంగా నియోజకవర్గం పేరును నమోదు చేయాల్సి ఉంటుంది.
- దరఖాస్తుదారుని కుటుంబసభ్యులందరి పేర్లు, వారి ఆధార్‌కార్డు నెంబర్లు, రేషన్‌కార్డు నంబర్ వివరాలు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాల్సివస్తోంది.

ముడిసరుకులు కూడా కొనుగోలు చేయవచ్చు..

- ఈ పథకం కింద ఇచ్చే రూ.లక్షతో లబ్ధిదారులు వారి చేతి, కులవృత్తులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు చేసుకోవచ్చు. అలాగే అవసరమైన ఉపకరణాలను కూడా కొనుగోలు చేసుకునేందుకు వీలుంటుంది.
- వీటికి ఈ ఆర్థిక సహాయాన్ని ముడిసరుకులు కూడా కొనుగోలు చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. ఈ కొనుగోలు చేసిన ఈ బిల్లులను ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి ఉంటుంది.
- మండల ప్రత్యేక అధికారి ఈ యూనిట్ల గ్రౌండింగ్‌ను పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

16 మంది లబ్ధిదారులకు చెక్కులు

- బీసీ కుల, చేతి వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయానికి సంబంధించిన పథకాన్ని జిల్లాలో శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు.
- జిల్లా వ్యాప్తంగా 16 మందికి రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించిన సంక్షేమ సంబరాల్లో సంగారెడ్డిలో ఆరుగురు, అందోల్, నారాయణఖేడ్‌లలో ఇద్దరు చొప్పున, పటాన్‌చెరువు, జహీరాబాద్ నియోజకవర్గాల్లో ముగ్గురు చొప్పున చెక్కులను పంపిణీ చేశారు.

ఐదేళ్లలోపు లబ్ధిపొందిన వారు అనర్హులు

- బీసీ కార్పొరేషన్ ద్వారా గానీ, బీసీ సంక్షేమశాఖ ద్వారా గానీ గత ఐదేళ్లలో రూ.50 వేలు అంతకంటే ఎక్కువ మొత్తంలో లబ్ధిపొందిన వారు ఈ పథకానికి అనర్హులుగా ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది.
- లబ్ధిదారుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలలోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు.

చిన్న జిల్లాల ఏర్పాటుతో ప్రజలకు చేరువైన పాలన

- సంగారెడ్డి జిల్లా ఏర్పాటుతో జిల్లా ప్రజల ఆకాంక్ష నెరవేరింది
- దేశానికే రోల్ మోడల్ తెలంగాణ రాష్ట్రం
- రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు



అవార్డు అందుకుంటున్న తెల్లాపూర్ మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): ప్రజలకు చేరువగా పాలనను అందిస్తూ, పారదర్శకంగా లబ్ధి చేకూరుస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేసీఆర్ తటబాటు లేని పరిపాలన అందిస్తున్నారని, నవ్వినచోటే నాప చేను పండినట్లు కేసీఆర్ చూపించారన్నారు. తెలంగాణ వస్తే నక్సలైట్ల రాజ్యం వస్తుందని, హైదరాబాదులో కర్ఫ్యూ వస్తుందని, చీకటిమయం అవుతుందని, తెలంగాణ వారికి పరిపాలించడం రాదని అంటూ పలు కారణాలు చెప్పి ఆనాడు ఆంధ్ర పాలకులు అడ్డుకున్నారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత కరెంటుతో వెలుగులు నిండాయని, దేశానికే తెలంగాణ రోల్ మోడల్ గా మారిందన్నారు. తొమ్మిదేళ్లలో సుపరిపాలనే అందుకు నిదర్శనం అన్నారు. సంగారెడ్డి జిల్లాను ఏర్పాటు చేసి జిల్లా ప్రజల ఆకాంక్షను నెరవేర్చారన్నారు. చిన్న జిల్లాల ఏర్పాటుతో ప్రజల ముంగిట్లోకి పాలన చేరువైందన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత జిల్లాలో కొత్తగా మూడు రెవెన్యూ డివిజన్లు, 9 మండలాలు, 4 మున్సిపాలిటీలు, 190 గ్రామపంచాయతీలు ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజలకు చేరువ చేశామన్నారు. అనంతరం ఉత్తమ గ్రామపంచాయతీల సర్పంచ్‌లు, ఉత్తమ మండలంగా ఎంపికైన మండల ప్రజా పరిషత్ లు మొగుడంపల్లి, పటాన్‌చెరు మండలాల ఎంపీపీలకు, జెడ్పీటీసీలు, ఉత్తమ మున్సిపాలిటీలుగా నారాయణఖేడ్, తెల్లాపూర్ మున్సిపాలిటీల మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌ను సన్మానించారు. అనంతరం సంగారెడ్డి జిల్లా సుపరిపాలన దినోత్సవం కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, శాసనసభ్యులు చంటి క్రాంతి కిరణ్, భూపాల్ రెడ్డి, మాణిక్ రావు, రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, డీసీసీబీ చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా అధికారులు, ఉద్యోగులు, పోలీస్ రెవెన్యూ అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పంచాయతీలు.. మున్సిపాలిటీలు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన తెలంగాణ సుపరిపాలన దినోత్సవంలో ఉత్తమ గ్రామ పంచాయతీలకు అవార్డులను ప్రదానం చేశారు. సంగారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ మండలంలోని కొత్తూర్(బి)కి ఉత్తమ గ్రామ పంచాయతి అవార్డును ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు సర్పంచ్ జగన్‌మోహన్‌కు అవార్డును అందచేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. పచ్చదనం, పరిశుభ్రత, పరిశుభ్రత, మంచినీటి వసతి, చెట్ల పెంపకం, అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, పల్లె వనాలు, హరితహారం, వైకుంఠధామాలు, రైతు కేంద్రాలు, కమ్యునిటీ హాళ్లు తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు అవార్డు అందజేశారు. ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు రావడంపై సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీగా అవార్డు ప్రదానం చేశారు. శనివారం సాయంత్రం సంగారెడ్డిలోజరిగిన సుపరిపాలన దినోత్సవంలో భాగంగా మంత్రి హరీశ్ రావు చేతుల మీదగా ఉత్తమ మున్సిపాలిటీ అవార్డును మున్సిపల్ చైర్ పర్సన్ లలితా సోమిరెడ్డి, కమిషనర్ శ్రీనివాసులు అందుకున్నారు.

నారాయణఖేడ్: మున్సిపాలిటీకి ఉత్తమ మున్సిపాలిటీ అవార్డు దక్కింది. మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్‌చైర్మన్ అహీర్ పరశురాం, కౌన్సిలర్లు మాజీద్, పుటాల కవితావిఠల్, నర్సింహులు, అభిషేక్ షెట్కార్, కోఆప్షన్ సభ్యులు అంబదాస్, లయక్, కమిషనర్ గోపు మల్లారెడ్డిలకు ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు తన చేతులమీదుగా అవార్డును అందజేశారు.

మునిపల్లి(అందోల్): మండల పరిధి పెద్దలోడి గ్రామానికి ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు దక్కింది. సర్పంచ్ పార్వతిఅశోక్‌ను మంత్రి హరీశ్‌రావు సన్మానించి మెమోంటో అందజేశారు.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): పాఠశాలలో ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయడంతో పాటు ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని కేవల్‌కిషన్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీఎస్ యుటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్నందున పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలని, అందుకోసం ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. హైస్కూల్స్‌లో సబ్జెక్ట్ టీచర్ల కొరతను తగ్గించడానికి ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని, అదే విధంగా బదిలీలు కూడా చేపట్టాలన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నందున జూన్ 20వ తేదీన నిర్వహిస్తున్న విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని డీఎస్సీ నోటిఫికేషన్ వేయాలని, పర్యవేక్షక అధికారులు డీఈఓ, ఎంఈఓ, డిప్యూటీ ఈఓ పోస్టులను వెంటనే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అశోక్, ప్రధాన కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షులు కాశీనాథ్, ఎం.సువర్ణ, జిల్లా కార్యదర్శిలు శ్యామయ్య, అరుణశ్రీ, సంయెద్దీన్, జగన్మోహన్, అనురాధ, కష్ణంరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రన్ విజయవంతం చేయండి

డీఎస్పీ రవీంద్ర రెడ్డి

సంగారెడ్డి మున్సిపాలిటీ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 12వ తేదీన తెలంగాణ రన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంగారెడ్డి డీఎస్పీ రవీందర్ రెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై న్యూ బస్టాండ్‌కు చేరుకుంటుందన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్ పర్సన్ మంజుశ్రీ జైపాల్ రెడ్డి, కలెక్టర్‌శరత్, ఎస్పీ రమణకుమార్, జిల్లా ప్రముఖులు,ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ



జహీరాబాద్: జహీరాబాద్ ఆర్డీఓగా వెంకారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన రమేశ్ బాబు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కార్యాలయ సిబ్బంది పూల గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

రాజీయే రాజమార్గం

సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి శశిధర్ రెడ్డి

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ శశిధర్ రెడ్డి అధ్యక్షతన శనివారం జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా పది బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. రాజీమార్గంలో కేసులను పరిష్కరించుకుంటే ఇరు వర్గాలకు ప్రయోజనం ఉంటుందని లోక అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమ తీర్పని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 ఎంవీఓపీ కేసులు, 31 సివిల్ కేసులు, 5203 క్రిమినల్ కాంపౌండ్ కేసులు, 107 బ్యాంకు రికవరీ కేసులు, 13 సివిల్ భూసేకరణ కేసులు, 2167 విద్యుత్ కేసులు, నష్టపరిహారం, రికవరీ కేసులను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హనుమంతరావు, సివిల్ జడ్జిలు, స్పెషల్ ఎక్సైజ్ కోర్టు జడ్జిలు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి సంక్షేమ పథకాలు

రాష్ట్ర మత్స్యసహకార సంఘాల ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్



మాట్లాడుతున్న రాష్ట్ర మత్స్యసహకార సంఘాల ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్

సంగారెడ్డి టౌన్: మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెటిందని రాష్ట్ర మత్స్యసహకార సంఘాల ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా సంగారెడ్డి పాత డీఆర్డీఏ కార్యాలయంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ ముగింపు వేడుకలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌కు హాజరుకావడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్ మత్స్యకారుల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారన్నారు. తెలంగాణలో 5600 మత్స్య సొసైటీలు ఉన్నాయన్నారు. దాదాపు 4.75లక్షల మంది సభ్యత్వం కలిగి ఉన్నారని, సభ్యత్వం ఇంకా పెంచాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో మత్స్యకారుల సమస్యల కోసం రాష్ట్ర మత్స్యశాఖ కార్యాలయంలో ఉచిత టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి వారితో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఏడీ సతీష్, సంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, జిల్లా ముదిరాజ్ మహాసభ, నియోజకవర్గ, మండలాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాటు పూర్తి



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరాం

కొండాపూర్(సంగారెడ్డి): ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరాం తెలిపారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఇంటర్మీడియట్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 15,362 మంది విద్యార్థులు హాజరు కానున్నారని చెప్పారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 10,634, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 4728 మంది ఉన్నారన్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయన్నారు. జిల్లా వ్యాప్తంగా 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 28 మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 28 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 13 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌లను నియమించినట్లు తెలిపారు. వీరితోపాటు 2 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ నియమించడం జరిగిందన్నారు.

ప్రమాదకరం.. క్వారీ గుంత

- చెరువులను తలపిస్తున్న వైనం
- నీరు నిల్వ ఉండటంతో ఈతకు వెళ్తున్న యువకులు
- లోతు తెలియక మృత్యువాత
- గుంతలను పూడ్చాలని కోరుతున్న స్థానికులు



రాళ్లకత్వ సమీపంలోని ఓ క్రషర్ వద్ద భారీ గుంత

జిన్నారం(పటాన్‌చెరు): కంకర కోసం తవ్వుతున్న గుంతలు ప్రమాదకరంగా మారుతున్నారు. ఈ గుంతల్లో నీరు చేరుతుండటంతో సమీప ప్రజలు, క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులు ఈతకు వెళ్తున్నారు. లోతు తెలియక మృత్యువాతపడుతున్నారు. తవ్వకాలతో ఏర్పడ్డ గుంతలను పూడ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

- పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఖాజీపల్లి, మాదారం, రాళ్లకత్వ, శివానగర్ ప్రాంతాల్లో 50 వరకు కంకర క్రషర్‌లు ఉన్నాయి. వీటి యాజమాన్యాలు సమీపంలోని బండరాళ్లను తవ్వి కంకరగా మారుస్తుంటారు.
- రాళ్లను తవ్వే క్రమంలో భారీగా గుంతలు ఏర్పాడుతున్నాయి. ఈ రాళ్లను బయటకుతీసిన తర్వాత యాజమాన్యాలు మట్టిని వేసి గుంతలను పూడ్చాల్సి ఉంటుంది.
- వారు ఈ నిబంధనలను పట్టించుకోకుండా గుంతలను అలాగే వదిలేస్తున్నారు. దీంతో వర్షం కురిసినప్పుడు ఈ గుంతల్లో నీరు చేరి నిల్వ ఉంటుంది. ఈ గుంతలు చెరువులను తలపించేలా ఉంటాయి.
- వేసవి కావటంతో మధ్యాహ్నం సమీపంలోని గ్రామాల ప్రజలు, కంకర క్రషర్ పనిచేసే కార్మికులు స్నానాలు చేసేందుకు వెళ్తుంటారు. ఇటీవల ఖాజీపల్లి సమీపంలోని ఓ కంకర క్రషర్ వద్ద ఉన్న గుంతలో స్నానం చేసేందుకు వెళ్లిన ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ విధంగా ఏటా పది మంది మృత్యువాతపడుతున్నారు.
- ఏటా జనం మృత్యువాతపడుతున్నా సంబంధిత అధికారులు, కంకర క్రషర్‌ల యాజమాన్యాలు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి పనిచేస్తున్న కార్మికులే ఈ గుంతల్లో పడి మృతి చెందుతున్నా యాజమాన్యాలు గుట్టు చప్పుడుకాకుండా మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు.
- ఇలాంటి ఘటనలపై అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కంకర క్రషర్‌ల వద్ద ఏర్పడిన భారీ గుంతలను పూడ్చి వేయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

యాజమాన్యాలను హెచ్చరిస్తున్నాం

గుంతల పూడ్చివేతకు చర్యలుతీసుకోవాలని యాజమాన్యాలను తరచూ హెచ్చరిస్తున్నాం. వాటిని పూడ్చని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటాం. యాజమాన్యాలు స్పందించి తక్షణమే గుంతలను పూడ్చాలి. కార్మికులు, సమీపంలోని గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– దశరత్‌సింగ్ రాథోడ్, తహసీల్దార్, జిన్నారం

క్లుప్తంగా

రాంసాగర్‌లో చెరువులో చేపలు మృతి



ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపలు

రాయపోలు(దుబ్బాక): మండలంలోని రాంసాగర్ చెరువులో చేపలు మృతిచెందాయి. మత్స్యకారుల వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎల్లమ్మ చెరువులో శుక్రవారం సాయంత్రం కొన్ని చేపలు తేలి ఉండడాన్ని మత్స్యకారులు గమనించారు. శనివారం ఉదయం చాలా చేపలు మృతిచెంది నీటిపై తేలడంతో ఎవరైనా విషప్రయోగం చేసి ఉంటారా.. అనే అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ మహబూబ్ వచ్చి చెరువును పరిశీలించారు. పశు వైద్యులతో పోస్టుమార్టం నిర్వహించారు. 3 క్వింటాళ్ల వరకు చేపలు మృతిచెంది ఉంటాయని, పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో వ్యక్తి మృతి

నెలన్నర వ్యవధిలో తండ్రీకొడుకు..



కృష్ణాగౌడ్(ఫైల్)

వర్గల్(గజ్వేల్): నెలన్నర వ్యవధిలో తండ్రి, కొడుకు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన కారు డ్రైవర్ నగరం కృష్ణాగౌడ్(45)కు భార్య అన్నపూర్ణ, కొడుకులు శేఖర్, అభిలాష్ ఉన్నారు. కొడుకులు ఇద్దరు ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్న కొడుకు అభిలాష్‌గౌడ్(22) ఏప్రిల్ 22న మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ ఘటన నుంచి కోలుకునేలోగా శనివారం అనారోగ్యంతో తండ్రి కృష్ణాగౌడ్ మృతిచెందాడు.

రేషన్ బియ్యం స్వాధీనం

జహీరాబాద్ టౌన్: రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు పట్టుకున్నారు. పట్టణంలోని అల్గోల్ చౌరస్తాలో పోలీసులు, సివిల్ సప్లై అధికారులు శనివారం తనిఖీలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ముంబాయి వైపు వెళుతున్న లారీపై అనుమానం రాగా తనిఖీలు నిర్వహించారు. లారీలో అక్రమంగా తరలిస్తున్న 298 క్వింటాల రేషన్ బియ్యం గుర్తించి పట్టుకున్నారు. లారీ యజమాని బావేష్‌బాయ్‌తోపాటు డ్రైవర్ సంజయ్, రషీద్‌ఖాన్‌లపై కేసు నమోదు చేశారు.

వర్గల్ క్షేత్రం.. ఉత్సవ శోభితం

- నేడు శంకరమఠం, వేద పాఠశాల ప్రారంభోత్సవం
- హాజరుకానున్న కంచి పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి
- మూడు రోజులు పాటు నిర్వహణ



శంకరమఠం వద్ద స్వాగత తోరణం

వర్గల్(గజ్వేల్): శ్రీ కంచి శంకరమఠం, శ్రీశారదా వైదిక స్మార్త విద్యాలయ ప్రారంభోత్సవానికి వర్గల్ శ్రీవిద్యాసరస్వతి క్షేత్రం ముస్తాబైంది. ఆదివారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్న వేడుకలకు కంచి కామకోటి సర్వజ్ఞ పీఠాధిపతి శ్రీవిజయేంద్ర సరస్వతి హాజరుకానున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు క్షేత్రాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కాషాయ తోరణాలు, జెండాలు, విద్యుత్ కాంతులను ఏర్పాటుతో క్షేత్రానికి ఉత్సవ శోభ సంతరించుకుంది. శామీర్‌పేట రింగు రోడ్డు నుంచి వర్గల్ వరకు స్వామివారికి స్వాగతం పలుకుతూ కటౌట్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి తెలిపారు.

కార్యక్రమ వివరాలు

- ఉదయం 8 గంటలకు శ్రీవిజయేంద్ర సరస్వతి స్వామికి వర్గల్ క్రాస్‌రోడ్డు వద్ద పూర్ణకుంభ స్వాగతం పలుకుతారు.
- వర్గల్ హనుమాన్ టెంపుల్ నుంచి శోభాయాత్ర, మంగళహారతులతో స్వాగతం ఉంటుంది.
- 8.30 గంటలకు శంకర మఠం, వేద విద్యాలయాన్ని ప్రారంభిస్తారు.
- సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభోత్సవ సభ ఉంటుంది.
- శ్రీవిజయేంద్ర సరస్వతి ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం శ్రీచంద్రమౌళీశ్వర పూజ నిర్వహిస్తారు.
- ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు, సోమవారం ఉదయం 7 గంటల నుంచి 9 గంటలు, సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు, మంగళవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుంది.
- వేడుకలకు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పీఠాధిపతులు హాజరవుతారని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



విద్యుత్ కాంతుల్లో వర్గల్ శ్రీకంచి శంకరమఠం

ఇరువర్గాల మధ్య భూతగాదా



తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్న నారాయణరెడ్డి కుటుంబసభ్యులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి శివారులో ఓ స్వాతంత్య్ర సమరయోధుడికి ప్రభుత్వం కేటాయించిన భూమి విషయమై ఇరువర్గాల మధ్య కొన్నేళ్లుగా గొడవ జరుగుతోంది. మండలపరిధిలోని మానెపల్లి గ్రామానికి చెందిన రాఘవులు నారాయణరెడ్డికి సమరయోధుల కోటాకింద ప్రభుత్వం 1984–85లో వెల్దుర్తిలోని సర్వే నంబర్ 210లో 10 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భూమిని వెల్దుర్తికి చెందిన రమేశ్‌చందర్ కబ్జా చేసి, తన కుటుంబసభ్యుల పేరిట రికార్డు మార్పు చేసుకున్నాడని నారాయణరెడ్డి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. శనివారం ఆ భూమిలోకి వెళితే రమేశ్‌చందర్, అతని కుటుంబ సభ్యులతోపాటు మరికొందరు తమపై దాడిచేసి చంపడానికి ప్రయత్నించారని నారాయణరెడ్డి కుమారుడు మదుసూధన్‌రెడ్డి, కోడలు శారద, కూతురు వెంకటలక్ష్మి, అల్లుడు వెంకట్రామిరెడ్డి ఆరోపించారు. భూ తగాదా విషయంలో ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్‌ఐ వసురాం తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

చేగుంట(తూప్రాన్): ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంటకు చెందిన తోకటి శ్యామలకు 12 సంవత్సరాల క్రితం రాముతో వివాహం జరిగింది. రాము అత్తగారింట్లో ఉంటూ హమాలీ పనులు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 7న కుటుంబ సభ్యులంతా డాబాపై పడుకున్నారు. తెల్లారి లేచి చూసేసరికి రాము కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో, చుట్టుపక్కలా వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. శ్యామల ఫిర్యాదు కేసు నమోదు చేశారు.

తృటిలో తప్పిన ప్రమాదం



గ్యాస్ స్టవ్‌పై పడ్డ రాయి

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మీర్జాపూర్ గ్రామంలో శనివారం సాయంత్రం వీచిన గాలులకు పొన్నబోయిన లత ఇంటిపై కప్పు కూలిపోయింది. ఆ సమయంలో లత వారి పిల్లలతో ఇంట్లోనే ఉండటం గాలి వానకు ఇంటి పైకప్పు రేకులు కూలడంతో లత పిల్లల తీసుకొని బయటకు రావడంతో ప్రాణపాయం తప్పింది. పేద కుటుంబం ఇల్లుపై కప్పు కూలి నీడ లేకుండా పోయిందని ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు పొన్నబోయిన శ్రీనివాస్ కోరారు.

హరితహారం చెట్ల నరికివేతపై విచారణ



చెట్ల నరికివేతపై విచారణ చేస్తున్న పోలీసులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గొల్లకుంట గ్రామంలో రోడ్డుకిరువైపులా నాటిన హరితహారం చెట్లను ఓ రైతు నరికివేశాడు. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సుంకరి రాంచందర్‌రెడ్డి శనివారం మూడు పెద్దవృక్షాలను నేలమట్టం చేశాడని సమాచారం రావడంతో సిబ్బందిని పంపిచానన్నారు. విద్యుత్ వైర్లు చెట్ల పైనుంచి వెళ్లడంతో అప్పుడప్పుడూ మంటలు వస్తున్నాయని, ఈ కారణంగా చెట్లను నరికివేసినట్లు రైతు చెబుతున్నాడన్నారు. ఈ సంఘటనపై తమకు గ్రామస్తులెవరూ ఫిర్యాదు చేయలేదని, ఈ విషయంపై విచారణ జరిపిస్తామన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు.. అనారోగ్యంతో బాధపడుతూ మరొకరు, బావిలోదూకి ఇంకొకరు ఆత్మహత్య చేసుకున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో...



ఎల్లయ్య మృతదేహం

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..చేగుంటలోని సుభాష్‌నగర్‌కాలనీకి చెందిన ఈప్షి ఎల్లయ్య(30)కు సునీతతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు లేకపోయినా ఇద్దరూ కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆరు నెలలుగా ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి ఎల్లయ్య బైక్‌పై బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటినా ఇంటికి రాలేదు. బంధువులు ఎల్లయ్య కోసం వెతకగా, చేగుంట చెరువు వద్ద ఎల్లయ్య బైకు, చెప్పులు కనిపించాయి. పోలీసులు జాలర్ల సాయంతో చెరువులో వెతికించగా ఎల్లయ్య మృతదేహం లభ్యమైంది. భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.

బావిలో దూకి ...

కోహీర్(జహీరాబాద్): వ్యవసాయ బావిలో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ సురేష్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని బిలాల్‌పూర్ గ్రామానికి చెందిన గడ్డం ఏసయ్య(65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ప్రయోజనం లేకుండాపోయింది. మానసికంగా కుంగిపోయిన ఏసయ్య తన సొంత వ్యవసాయబావిలో దూకి శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుమారుడు ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి..



నాగభూషణం(ఫైల్)

దుబ్బాకరూరల్: అప్పుల బాధతో వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పద్మశాలి గడ్డలో జరిగింది. సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మ్యాదరి నాగభూషణం(55) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అప్పులు చేసి కుమారుడు, కూతురు వివాహం చేశాడు. చేసిన అప్పులు ఎక్కువ కావడంతో ఎలా తీర్చాలో తెలియక మానసికంగా బాధపడేవాడు. శుక్రవారం వడ్డెర కాలనీ సమీపంలో ఉన్న చింత చెట్టు వద్ద పురుగుల మందు తాగి పడిపోయాడు. వెంటనే గుర్తించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. అతడిని వెంటనే దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి నాగభూషణం మృతి చెందినట్లు నిర్ధారించారు. శనివారం మృతుడి భార్య దేవలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డంపింగ్ యార్డులో...

ములుగు(గజ్వేల్): ములుగు మండలం అల్లీనగర్ గ్రామంలో డంపింగ్‌యార్డులో ఓ యువకుడి మృతదేహాన్ని స్థానికుల సమాచారంతో పోలీసులు గుర్తించారు. మృతుడు సిద్దిపేట కాల్వకుంట కాలనీకి చెందిన మిట్టపల్లి విజయ్(27)గా పోలీసులు నిర్ధారించారు. ఘటనా స్థలాన్ని గజ్వేల్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి సందర్శించారు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

మొబైల్ ఫోన్లు అప్పగింత



మొబైల్ ఫోన్లను అప్పగిస్తున్న పోలీసులు

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన అనిల్, మనూరు మండలం శెల్గిరకు చెందిన తుకారాం నెల క్రితం తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నారు. పోర్టల్‌లో తమ వివరాలు నమోదు చేశారు. ఆయా మొబైల్ ఫోన్‌లు ఆన్‌లోనే ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. శనివారం బాధితులను ఖేడ్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి స్థానిక ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, కానిస్టేబుల్ రమేష్ తమ చేతుల మీదుగా అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటే మీ–సేవా ద్వారా సంబంధిత పోర్టల్‌లో వివరాలను నమోదు చేయించాలని ఎస్‌ఐ సూచించారు.

దేశం మెచ్చిన నేత కేసీఆర్

- రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు దేశానికి ఆదర్శం
- రాష్ట్ర వైద్యఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దేశం మెచ్చిన నేత ముఖ్యమంత్రి కేసీఆర్ అని రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి ఉస్మాన్‌నగర్‌లో ఏర్పాటుచేసిన కొల్లూర్ పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించారు. తర్వాత తెల్లాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీమల్లిఖార్జునస్వామి, శ్రీబీరప్ప స్వామి, విశ్వకర్మ దేవాలయాల నిర్మాణాలకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిలో కలసి భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రజల రక్షణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా నూతన పోలీస్‌స్టేషన్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని దానిని దృష్టిలో పేట్టుకొని ప్రభుత్వం కొల్లూర్ నూతన పోలీస్‌స్టేషన్ మంజూరు చేసినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఇక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర రాష్ట్రలకు చెందిన ఇతర పార్టీల నేతలు సైతం కేసీఆర్‌ను కలసి అభినందిస్తున్నట్లు తెలిపారు. కుల వృత్తులపై ఆధారపడిన వారికి ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. గొల్ల, కురుమల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందనివివరించారు. గొల్ల, కురుమల భవనల కోసం రూ.500 కోట్ల విలువ చేసే భూములను కేటాయంచడం జరిగిందని, ఆ భవనాలను త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెల్లాపూర్‌లో మల్లికార్జున స్వామి, బీరప్పా స్వామి, విశ్వకర్మ ఆలయాల నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. విశ్వకర్మ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.50 లక్షలు ఇవ్వడం సంతోషకరమన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటతో సమానంగా పటాన్‌చెరు నియోకకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. పటాన్‌చెరు పట్టణంలో మంత్రి సహాయ సహకారాలతో త్వరలో రూ. 300 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో కలెక్టర్ డాక్టర్ శరత్, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర, మున్సిపల్ చైర్‌పర్సన్ లలితా సోమిరెడ్డి, మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి, తెల్లాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ రాములు గౌడ్, రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పనగేష్, కౌన్సిలర్ పాల్గొన్నారు.



కొల్లూర్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవంలో మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

చికిత్స పొందుతున్న ముగ్గురి మృతి

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు యత్నించిన ఒకరు... రోడ్డు ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టి...



ఎల్లయ్య(ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): హెడ్ కానిస్టేబుల్ రంగారెడ్డి చెప్పిన వివరాల ప్రకారం.. దూల్మిట్ట మండలం జాలపల్లి గ్రామానికి చెందిన బందారం ఎల్లయ్య (43) శుక్రవారం బైక్‌పై నంగునూరుకు వస్తుండగా ఎదురుగా వస్తున్న యాట సాయిబాబ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య తల, ఛాతీకి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య బందారం స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..



కుమార్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని ధరిపల్లి గ్రామానికి చెందిన సల్ల కుమార్(29) ప్రైవేట్ పరిశ్రమలో పనిచేసేవాడు. మూడు నెలల క్రితం అక్కడ ఉద్యోగం మానేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి.దీంతో మానసిక ఆవేదనకు గురై గత నెల 30న పొలం వద్ద పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు నార్సింగి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స నిమిత్తం నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఎల్లారెడ్డిలో అంగన్‌వాడీ టీచర్



కవిత(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): మండలపరిధిలోని బూర్గుపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కవిత(35) తన భర్త జవహర్‌తో కలిసి శనివారం ఎల్లారెడ్డిలోని ఓ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం బైక్‌పై బయలుదేరింది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ సమీపంలోని బొగ్గుగుడిసె వద్ద రాగానే అకస్మాత్తుగా బండిపై నుంచి జారిపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిలో ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. కవిత విధినిర్వహణతో పాటు అందిరితో కలిసిమెలిసి ఉండేదని స్థానికులు తెలిపారు. ఆమె మృతి పట్ల సర్పంచ్ గుల్లరి సరితామల్లేషం సంతాపం వ్యక్తం చేశారు.

'ఆ టీచర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

హైదరాబాద్: డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులను అమలు చేసి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ఎమ్మెల్సీలు రఘోత్తమ్‌రెడ్డి, ఏవీఎన్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీ 2003 పాత పెన్షన్ పోరాట సమితి తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2004 జనవరి 1వ తేదీ నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం విధానాన్ని అమలులోకి తెచ్చిందని, 2004 జనవరి 1వ తేదీకి ముందే రాత పరీక్ష ఫలితాలు పూర్తయి నియామక ప్రక్రియలో జాప్యం కారణంగా సీపీఎస్ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం పరిధిలోని అన్ని శాఖల్లో అమలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉపాధ్యాయులను పాత పెన్షన్ విధానంలోనే కొనసాగించాలన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు.

ఆటో ఢీకొని...

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని అక్కారం మదిర గ్రామమైన కోనాపూర్‌కు చెందిన మొగుల్ల కన్నయ్య(32)కు తల్లిదండ్రులతో పాటు భార్య లావణ్య ఉన్నారు. కన్నయ్య కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. శుక్రవారం రాత్రి తన బైక్‌పై అక్కారం నుంచి కోనాపూర్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలోనే ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టగా, బైక్‌పై ఉన్న కన్నయ్య తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. కాగా ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి శనివారం గజ్వేల్‌లోని ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అక్కారం సర్పంచ్ బాల్‌చంద్రం, దాతర్‌పల్లి సర్పంచ్ తోట లక్ష్మణ్, ఎంపీటీసీ ఆంజనేయులు, నాయకులు విరాసత్‌అలీ, స్వామిచారి తదితరులున్నారు.

కారు అదుపుతప్పి ..

గజ్వేల్‌రూరల్: కారు అదుపుతప్పడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల చెప్పిన వివరాల ప్రకారం.. సిద్దిపేట హనుమాన్‌నగర్‌కు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రభాకర్‌రెడ్డి భార్య సుక్రుత, కొడుకు నిఖిల్(24), కోడలు వాణితో కలిసి కారులో శనివారం సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళుతున్నాడు. ఈ క్రమంలో ప్రజ్ఞాపూర్ శివారు రింగు రోడ్డు ఫ్లైఓవర్ దిగుతున్న క్రమంలో కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న నిఖిల్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతా వారికి గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు దాటుతుండగా..



జయమ్మ మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మేడ్చల్ మండలం దుండిగల్ గ్రామానికి చెందిన టి జయమ్మ(50) మనోహరాబాద్ మండలం రంగాయపల్లిలోని బంధువుల ఇంటికి వెళుతున్న క్రమంలో దండుపల్లి వద్ద రోడ్డు దాటుతుండగా ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆమె అక్కడిక్కడే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి గాయాలు



గాయపడిన రాములు

కొల్చారం(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం..ఆందోల్ మండలం చౌటకూరు గ్రామానికి చెందిన ఆకుల రాములు బైకుపై మెదక్ నుంచి వస్తున్న క్రమంలో కొల్చారం మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి చౌరస్తా సమీపంలోకి రాగానే బైకు అదుపు తప్పి కమాన్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అతడి తలకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం 108లో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నర్సాపూర్‌లో గుర్తుతెలియని బాలిక



నర్సాపూర్ రూరల్: గుర్తుతెలియని బాలిక నర్సాపూర్ బస్టాండ్‌లో ఉండగా, స్థానికులు సమాచారం ఇచ్చారని ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. శనివారం సాయంత్రం బస్టాండ్‌లో ఓ బాలిక ఏడుస్తూ ఉండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సిబ్బంది బాలికను స్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. అయితే ఆ బాలిక తన పేరుగానీ, తల్లిదండ్రులు పేరుగానీ మరే వివరాలు చెప్పలేకపోతోంది. బాలికను ఎవరైనా గుర్తిస్తే నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. బాలికను చైల్డ్ వెల్ఫేర్ అధికారుల వద్ద ఉంచామన్నారు.

చేపలు పట్టడానికి వెళ్లి..



ఊర చెరువులో అనయాతుల్లా మృతదేహం

మనోహరాబాద్(తూప్రాన్): చేపలు పట్టడానికి వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో మునిగి చనిపోయాడు. ఎస్‌ఐ సందీప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన మహ్మద్ అనయతుల్లా (28) పరిశ్రమలో పనులు చేయడానికి కుటుంబంతో కలిసి వచ్చి స్థానికంగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే శుక్రవారం చేపలు పట్టడానికి కాళ్లకల్‌లోని ఊరచెరువుకు వెళ్లాడు. శనివారం ఉదయం అనయతుల్లా మృతదేహం చెరువు నీటిలో తేలడంతో స్థానికులు పోలీసులు, కుటుంబసభ్యులకు సమాచారమిచ్చా రు. మృతుడి భార్య అస్మిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.